# ఆమె త్యాగం

సీతారామయ్యను నేను క్లబ్‌లో ఎరుగుదును. డిగ్రీలూ, మర్యాదా, ప్రాముఖ్యమూ గల ఆ క్లబ్‌లో సీతారామయ్యని చేర్చుకోడం ఎవరికీ ఇష్టంలేదు. నాకుకూడా. కాని, తనుచేరడం ఇష్టం లేదన్నవాణ్ణి తంతానని బెదిరించి చేరాడు. తంతానన్నాడంటే తన్ని తీరతాడని అందరికీ తెలుసు. అతను చేరింతరవాతనైనా అతన్ని మాలో ఒకణ్ణిగా చేర్చుకోనేలేదు. అతనివైఖరిమాత్రం, మీ రెంత వెధవలో నాకు తెలుసు. పంతానికి చేరానుగాని, మీరు నన్ను అంగీకరించక పోవడమే నాకు మర్యాద' అన్నట్టు తిరిగేవాడు.

అతను గొప్ప రౌడీ కావడమే కాకుండా, తన తండ్రి దమ్మిడీలు లెఖ్ఖ పెడుతో, సౌఖ్యాలు వొదులుకొని. వెట్టి చాకిరీచేసి కూడబెట్టిన గొప్ప ఆస్తిని ఒక స్త్రీకోసం- అందులో అందంలేని రోడ్డు వేశ్యకోసం తగలేశాడనీ, ఇంక మిగిలిన కొంచెమూ, మోటారులో ఆమెతో తిరిగే సరదాకోసం సరిపుచ్చుతున్నాడనీ తెలిసింది. పిసినారి అని బతికి వున్నన్నాళ్లూ తిట్లుతిన్న అతని తండ్రి ఇప్పుడు పబ్లిక్ సింపతీని సంపాయించాడు. ధనం భద్రంచేసుకుని, తక్కిన అల్లర్లు ఎన్నిచేసినా లోకం గౌరవిస్తుంది; ధనం వున్నప్పటి అతని గ్వరం ధర్మంగా కనపడ్డది. కాని, ధనం తరుగుతున్నకొద్దీ, అతని ముఖంలో గర్వం, సంతోషం. మనుషుల్ని చూసి అల్పభావం ఎక్కువుతున్నాయి !

"ఏం చూసుకుని ఆ బోర్ల పడడం ?"

"దాన్ని చూసుకునేమో ?"

"తన రంభముందు కులకమను. మనముందు ఎందుకు ?"

"మనకి ఆ రంభ లేదుకదా అనిగావును !"

"అట్టే ఏం రంభకాదు. నేను చూశాను."

"ఇదివరకు గుంటూరులో ఆమె ఖరీదు ఆరణాలు, రెండు బంతి పువ్వులూ-"

"తాను వొలించింది--"

సీతారామయ్య వొస్తున్నాడు. వూరుకున్నాము.

నాకు స్నేహమైన సంవత్సరానికి గావును, అతను క్లబ్బుకురావడం మానాడు. జబ్బుగా వుందన్నారు. వూరువిడిచి వెళ్ళాడు. తరువాత తిరిగివచ్చాడనీ, అతని జబ్బు క్షయ అన్నారనీ తెలిసింది. అతని మేడా, కారూ వేలం పడ్డాయి. ఊరివెలపల ఏదో గుడిశెలో కాపరమున్నారని తెలిసింది. అతన్ని వెళ్లి చూడాలనుకున్నాను. కాని అదివర కెన్నడూ అతని యింటికి వెళ్ళలేదు. అతని కిష్టముంటుందో లేదో, అందులో సరైన మర్యాద కాపరంకూడా కాదయ్యెను, అని వెళ్ళడం మానుకొన్నాను. కాని వారం రోజుల్లోనే అతన్ని చూడడానికి రమ్మని కబురువొచ్చింది. ఇంక డాక్టర్లైన తరువాత నా యిష్టాలతో పనేముంది?

## 2

మొదట ఆ కుటీరాన్ని చూడగానే, నా కాశ్చర్యం వేసింది. బీదతనంవల్ల ఆ దేవిడీవంటి మేడని వొదిలారా, లేక యీకుటీరం అందాన్ని వొలిచి స్వప్నాలుకని యిట్లా సృష్టించుకున్నారా అనిపించింది. యింటిముందర పూలమొక్కలు, తడికలకు అతికించిన పూలకాయితాలు, చిన్నపటాలు, అద్దకాలపరజాలు, రోగిమంచందగ్గర కొమ్మలు, పూలు, అలికి ముగ్గువేసిన నేల, శుభ్రత అన్నీ నాకు ఆహ్లాదాన్ని కలిగించాయి. ఆమెవొచ్చింది. తలెత్తి ఆమెవంక చూడగానే తెలిసింది నా అంతరాత్మకి, నా జీవితంలో శాశ్వతమైన పదచిహ్నాన్ని వదలగల ఒక గొప్ప నిమిషం తటస్థమయిందని. ఆమెలో అందం లేదు. పెద్ద కళ్లుకావు, కోలముక్కులేదు, గొప్ప అవయవాలు లేవు, ఆకర్షించే వక్షంలేదు, కాని యేదో శుభ్రం, పతివ్రత, పాతివ్రత్యం, శోభ, ఆమె నావరించి ఉంటాయి. ఆమె ముఖంలోని చిరునవ్వు పిలిచి స్నేహం చేసుకుందినన్ను. లోకమంతా వొదిలి యిక్కడ వుంటే నేమని అప్రయత్నంగా తోచింది. ఈమెవల్ల అత నిదివరకెంత ఆనందాన్ని పొందివుండాలో! యీమెకాంతితో, చిరునవ్వులతోటి తన గృహము, హృదయము యెంత గొప్పగా వెలిగివుంటాయో అనుకున్నాను. రాత్రింబవళ్లు యీమెపక్కన వుంటే, రోగినై మంచంమీద పడుకొనివుంటే నేం ?

ప్రతి వుదయం నే నా గుమ్మములో కాలుపెట్టడంతోటే పారిజాతపువ్వువాసన, వెన్నెల మెత్తదనమూ, ఆకాశపు విశాలత్వమూతోచేట్టు, ఆమెశాంతమైన చిరునవ్వు, కళ్ళలోని దయ నన్నావరించేవి. అక్కణ్ణించి కదలి వూళ్ళోకి వెళ్ళడం తలుచుకుంటే, కణ్వాశ్రమంనించి దండకారణ్యంలో ప్రవేశించడంలాగుండేది. ఆ ఆకర్షణశక్తీ, సౌమ్యశాంతస్ఫూర్తీ యెట్లా, యెందుకు ఆమెనించి ప్రసరించేవో నాకర్థం కాదు. అపురూపంగా కొందరున్నారు. వారిలో ఒక్కొక్కరు యెప్పుడో తటాలున కంటపడగానే మురికికాల్వలూ, నల్లని గోడలూ, ఎర్రని దుమ్మూ వీటిలోంచి హఠాత్తుగా గంధర్వద్వారం తెరుచుకొని శీతలఛాయలతో ఆహ్వానించే సుందరారణ్యంలోకి వెళ్ళినట్టుంటుంది. విశాలమైదానముపైని నిర్మలాకాశాలు, నీలంగాతళతళలాడే చల్లని తేటనీటి సరోవరాలూ, పెద్దవైన తెల్లని పద్మాలరేకులూ స్ఫురణకు వొచ్చి హృదయం చెప్పరాని బాధతో కొట్టుకొంటుంది. మనజన్మసార్థకము చెయ్యగల ఆ సుందరవిహారాలన్నీ వొదిలి అక్రమమూ, అసహజమైన మన సిగరెట్ జీవితాలతో అసంతృప్తి కలుగుతుంది. ఎన్ని పూర్వజన్మాలవాసనో పూర్వయుగాల్లో అనుభవించిన సహజజీవనపు నిగూఢ జ్ఞాపకమో! ఈ కాఫీ హొటళ్ళూ డబ్బు నెగేసేరోగులూ, ప్రేమ లేక కులాసాగా మాట్లాడేక్లబ్ స్వార్థస్నేహితులూ, ఐడోఫారం కంపులూ అన్నీ పోయి పొలాల మధ్యనో, చెరువుగట్లనో, పర్వతాగ్రాలనో నివసించాలని ప్రోత్సహించే రూపం ఆమెది.

ప్రొద్దునే ఆమె మొఖం దర్శనం చేసితరువాత దినమంతా నాశక్తులన్నీ కృశించేవి. ఏదిచూసినా అసంతుష్టి, యెవర్ని చూసినా విసుగు, ఈశ్వరుని దివ్యమంగళవిగ్రహాన్ని చూసి, ఆ ఆనంద మనుభవించిన భక్తుడివలె ఈలోకసౌఖ్యాలు అల్పమనిపించాయి. ఎవరు

డబ్బు చేతిలోపెట్టినా, ఎవరు కృతజ్ఞతతో నమస్కారాలు పెట్టినా వ్యర్థమనిపించింది. నాకీర్తి గాని "చెక్‌బుక్"గాని నాకేమీ సంతుష్టి నివ్వలేదు.

ఎక్కడ పువ్వుల్ని చూసినా, ఉదారకార్యాల సంగతివిన్నా, సంగీతం చెవినితాకినా ఆమె తీవ్రంగా జ్ఞాపకంవొచ్చి బాధ కలిగేది.

ఈ అశాంతి అంతా ఆమెమీదమోహంవల్లనా, ఆమెమీద వాంఛా నన్నిట్లా బాధిస్తోంది అని ఆలోచించా నొకరాత్రి. ఆమె నన్నంగీకరించినట్టూ, నా హస్తాల్లో ఆమెను అదుముకున్నట్టూ భావించుకొని చూశాను. వెంటనే నాపైని, నాకామంపైని పరమాసహ్యం కలిగింది. మంచివాసనలతో మెత్తని రంగులతో నవ్వే గులాబిపువ్వుని యెంగిలి ముద్దు పెట్టుకున్నట్టే. చల్లని నిర్మలమైన చందమామను వేడినిశ్వాసాలతో కావిలించుకున్నట్టే. శుభవుదయతేజస్సులో బూతులు మాట్లాడినట్టుంది. ఐతే నన్ను విడువని ఈ వెర్రివేదనకి అర్థం యేమిటని ఆలోచించాను, కాని ఆ సమస్యకి అంతం కనపళ్ళే దారాత్రికి. అందమూ, యవ్వన ప్రారంభమూ లేని ఆమెవల్ల యీబాధ అసహజమైన భ్రమ. విపరీతమైన మాయ. దానినుంచి తప్పించుకోవాలి. మనసులో ఆమెని గురించి ఎనలైజ్ చేసుకుని కాంక్షించవలసిన కారణమేమీ లేదని నా మనసుకి నేనే గట్టిసమాధానం చెప్పుకుని ఆ రాత్రికి నిద్రపోయినాను. మర్నాడామెని చూడగానే, ఈమెలోని ఆ ఆకర్షణకి కారణం కనిపెట్టాలని వెతికాను. ఎందుకిట్లా హృదయాన్ని కలవర పెడుతూందని. నెమ్మదిగా చూచి ఆమెకళ్ళల్లో శాంతమైన సరస్సుల్లో ప్రతిఫలించే ఆకాశం కనపడ్డదో, యెగిరేపక్షుల వొచ్చీరాని నడక ఆమె గమనంలో తోచిందో, వొత్తుగా పెరిగిన గడ్డి నీడలు, ఆమె కుంతలాలు గుబుర్లలో కలిగాయో, దూరపు పర్వతాల నీలపు నునుపు, వానలు కడిగిన గాలిపరిమళం, ఆమె దేహకాంతిలో కరిగినట్లుందో గాని చూసినకొద్దీ, ఆలోచించినకొద్దీ వలలో కొట్టుకునే పక్షవలె నా మనసు మరింత తీరని వాంఛతో తప్తమయింది.

ఒక్కవారంలో జీవితం దుర్భరమయింది. అభిమానమూ, న్యాయమూ, స్నేహమూ, ధర్మమూ అన్నీ త్యజించి, ఆమెపాదాలపైన పడి కన్నీళ్ళతో- యేమడగను? యేమిటంటే, యేం కావాలంటే యేమని చెప్పను? నాకే తెలీదే! ఒక్కటిమాత్రం రూఢిగా నిశ్చయమయింది. ఆమె నాతో వుండాలి, నా యింటిని పువ్వులతోటి, కాంతితోటి నింపాలి. అంతవరకు నా వాంఛ స్పష్టము. ఆమెనుంచి దూరంగా జీవించడం దుర్భరం. కాని యెట్లా? యెవర్నో వొదిలి సీతారామయ్యతో వుండగా లేనిది, అతన్ని వొదిలి నాతో నివసించకూడదా? కాని నేను సంఘంపట్ల ఆ సాహసాన్ని చూపగలనా? పోనీ ఆ కుటీరంలోనేవుంచి రహస్యంగా-ఛీ-ఛీ-నా మనస్సు తిరుగబడ్డది. పోనీ ఆమెను వేరే కాపురముంచి-వొస్తుందా?-యిట్లాంటి మనుష్యులు డబ్బుకే అమ్ముకుంటారు దేహాన్నీ, ఆత్మనీ. సీతారామయ్య యిప్పుడామెకి మహాభారం. కాని ఆమెనిగురించి అట్లాంటి ఆలోచనలు చేసిన పాపానికి నా నాలిక కొరుక్కున్నాను. నా గుడ్డితనానికి, అహంభావానికి నామీద

నాకు చాలా కోపం వచ్చింది. అతని బాధను తగ్గించినందుకై నేనేమడిగినా యివ్వదా అనిపించేది. కాని నమ్మిన నానించి అట్లాంటి కోర్కెరాగానే ఆమెకళ్లు కష్టంతో కిందికి వాల్చడమూ, మెల్లిగా మొహంలోని దయ మబ్బులవలె కరిగి కోప కాంతి చెంపల్ని ఆవరించడమూ, ఒక్కమాట లేకుండా మెడతిప్పుకొని పెదిమ కొరికి యేం చెప్పడమో తెలీక ఆమె వెళ్ళిపోవడమూ తోచి నన్ను బంధించేవి.

## 3

మెల్లిగా ఆమె వొంటిమీద సన్నని బంగారు గాజులూ, రాళ్ళకమ్మలూ చివరికి నానూ అన్నీ మాయమవుతో వుండడం నాకు కనపడ్డది. ముందు నా బిల్లులు సగంధర తగ్గించాను. ఒకరోజు వొంటింట్లో యెవరితోనో మాట్లాడుతూ వుంటే నేను వినవలసివచ్చింది. ఆమె యెవరికో చీరెను యెనిమిదిరూపాయల కమ్మింది. ఆ కొన్నాటిచీరెను నేను చూశాను. కొత్తది యాభై రూపాయలుంటుంది. దానికి కొంచెం చిరుగుంది. దాన్ని తీసుకుని రూపాయలిమ్మని వాడు పోట్లాడుతున్నాడు. ఆ రూపాయలు ఖర్చు అయినాయి, లేవని యీమె అంటోంది. నేను నిశ్చేష్టితుణ్ణయిపోయినాను. ఇంటికి వెళ్ళి కవరులో యాభైరూపాయలు పెట్టి తీసుకోమని బతిమాలుతూ సీతారామయ్యకు పంపాను. మర్నాడు వెళ్ళగానే ఆ రూపాయలు నా చేతులో పెట్టింది. మాట్లాడ్డానికి చేత కాక నేను వెళ్ళిపోయినాను.

"ద్రాక్షపళ్లు, ఆపిల్సు యిచ్చితీరాలా?" అంది ఆమె, కష్టంతో, మర్నాడు.

"తప్పదు. యింకా యివ్వాలి. మీ స్థితి చూసి చెప్పక ఊరుకున్నాను" అన్నాను నోరు జారి.

"అట్లా అనుకోకండి. ఇవ్వవలసినవన్నీ చెప్పండి. పరవాలేదు" అంది.

ఈ కళ్ళతోనే ఆమె క్రమంగా చిక్కిపోవడం అసహాయంగా చూశాను. భోజనం మానేస్తోందని తెలుసు. ఎప్పుడూ వికాసంగా వుండే ఆమె మొహం కొంచెంగా వాడింది. ప్రియుడి జబ్బులోనూ, కాలుస్తున్న దరిద్రంలోనూ శాంతంగా ఆనందంగా తిరుగుతూవున్న ఆమె నడక కొంచెం మందగించింది. గర్వంగా ప్రపంచాన్ని, విధిని ధిక్కరించి నవ్వే ఆమె పెదవి కిందికి జారింది. నే నెట్లా భరించను?

ఆ రోజు పొద్దున ఆమె నాదగ్గిరగా నుంచుంది.

"ఆయన వొంటో నెమ్మదిగానే ఉందండి, మీ రెందుకు వృధాగా రావడం?" అంది. రోగి మూలిగి నావంక చూడక గోడవేపు తిరిగాడు. యేం చెయ్యను?

"సరేలెండి. కాని, సీతారామయ్యగారితో కొంచెం మాట్లాడి వెడతాను" అన్నాను. ఆమె వెళ్ళింది.

"నాదికాని వ్యవహారంలో జోక్యం గలుగ జేసుకున్నందుకు క్షమించండి. నన్ను వైద్యుణ్ణిగా గాక స్నేహితుడిగా చూచుకోండి. మీకు యింకా నెలల కొద్దీ వైద్యసహాయం

అవసరం. నా దగ్గర్నించి వుచితంగా తీసుకోకపోయినా, బాకీకింద చూసుకోండి. కాని, మందు మానితేమాత్రం తప్పకుండా మొదటిస్థితికి వస్తారు.''

అతని కళ్ళంబడి నీళ్ళొచ్చాయి.

“నా భార్య వొప్పుకోదు. ఇంక రాకండి. మందు పంపకండి.'' అన్నాడు.

ఇంటికి వెళ్ళి ఆలోచించి వరసగా నాల్గురోజులు నాల్గు పదిరూపాయలనోట్లు ఎవరు పంపారో తెలియకుండా పోస్టులో పంపాను.

## 4

పదిరోజు లయింది నే నా యింటివైపి వెళ్ళి, అడుగుదూరంలో వున్న చల్లని కొబ్బరితోటలోకి వెళ్ళడం చేతకాక, యెండలో కాళ్లు కాలుతూ గంతులు వేస్తున్నట్టుంది నా జీవితం. ఆమె త్యాగాన్ని తలుచుకున్నప్పుడు నా మూములు వుదారాన్ని, ధర్మాన్ని తలుచుకుని అంత నీరసపుపనులు చేసినందుకు నాకు సిగ్గేసింది. గుండె నిబ్బరం చేసుకొని యిటూ అటూ చూడక దమ్మిడీల దగ్గర్నించి కోట్ల దాకా పోగుజేసి, కుబేరుడు కావాలి; లేకపోతే సర్వమూ త్యాగంచేసి శుష్కదరిద్రుడు కావాలి. అంతేకాని మర్యాదలకోసం, రూపాయి, అర చందావేసి, యేడుస్తూ చెల్లెళ్ళకూ, మేనపిల్లలకూ తిండి పెట్టి చీరెలిచ్చేబతుకు ఎందుకొచ్చింది? సుఖంగా భోజనం ముందు కూచున్నప్పుడు కాళ్లు కడుపులో పెట్టుకొని పడుకున్న ఆమెశీలం జ్ఞాపకంవొచ్చి తిండి సహించదు. చీట్లపేకతో క్లబ్బులో కాఫీ తాగుతో కాలం గడిపే సంతోషమయాన రాత్రింబవళ్లూ నిమిషం శాంతి నెరక్క చాకిరీ చేసే ఆమె దృఢత్వం జ్ఞాపకంవచ్చి పేక పారేసి లేచేవాణ్ణి. ధీరత్వాన్ని, దేశసేవను, త్యాగాన్ని పొగిడితే నాకు సిగ్గయి ఆమెసంగతి చెప్పాలని నోటివరకూ వచ్చేది. ఒకసారి క్లబ్బులో కొంచెం కదిపాను. వెంటనే పార్వతీశం, “అదిరా - సీతారాముడి ఉంపుడు మనిషేనా? దాన్నా సాటి తీసుకొస్తున్నావు? అవును, ఈమధ్య నువ్వు ట్రీట్ - ''

'షటప్' అన్నాను కళ్ళెర్రజేసి.

తరవాత యింక ఆ ప్రస్తావన రానేలేదు. కాని క్లబ్బులోమాత్రం మనుష్యు లామెను మరచిపోలేదు.

“ఇంకా వాడితోనేవుందిరా? అడుగుబొడుగు యింకా మూటకడుతోంది గావును? యింతవరుకు క్షవరం చేసింది. రోగాన్నంటించింది. ఇంక వదలకూడదూ, వాడి పీనుగను కళ్ళారా చూసి కాని వదలదా?''

ప్రజల హృదయాలిప్పుడు సీతారామయ్యకోసం ద్రవిస్తున్నాయి.

రాత్రులు కూడా పక్కన పడుకుని ప్రాణాలన్నీ బైటికి దగ్గే ఆ నిర్భాగ్యుడి ప్రతి ఆయాసంలోనూ, తన ప్రాణాలు పొయ్యేట్లు బాధపడే ఆమె జ్ఞాపకం వొచ్చింది.

# 5

నా శ్రమ తీరేట్టు పొలాలమీదనుంచి గాలివీస్తోంది. నీళ్ళల్లోంచి కప్పలు వింతగా నావంక చూస్తున్నాయి. చేలలో బంతిపువ్వులూ, పొట్లపువ్వులూ అందంగా కనపడ్డాయి. ఆమె కుటీరంబైటనుంచుని వుంది. నన్ను చూడగానే యెందుకు మళ్ళీ వొచ్చావన్నట్టు చూసింది.

"ఊరికే స్నేహానికి చూడ్డానికి వొచ్చాను. అదీ యిష్టం లేకపోతే వెళ్లిపోతున్నాను."

చప్పున నా చెయ్యి పట్టుకొని ఆమె, "మీరు రావడం మానేసిం తరవాత యెంతో వంటరిగా వుంది. ఆనందం కలిగించే అరగడియ కాలమూ జీవితంలోంచి మాయమయింది. తప్పకుండా రండి. ప్రతిరోజూ రండి. యిట్లా-సాయంత్రం-" అంత మాట్లాడేనని చప్పున ఆగింది. కళ్ళంబడి వొచ్చే కన్నీటిని ఆపుకొని అవతలకి తిరిగి లోపలకి వెళ్ళింది. సీతారామయ్య దగ్గిర అరగంట కూచున్నాను. అతను అలిసి కళ్లు మూసుకోగానే, నన్ను బైట కుర్చీవేసి కూచ్చోపెట్టి కాఫీ ముందర పెట్టి నుంచుంది.

"మీరు కూచోరా" అన్నాను-

కింద నాపరాయిమీద కూచుంది. యెంతో వాడిలిపోయింది. బుగ్గలుకిందికి వేళ్లాడాయి. కళ్ళచుట్టూ నల్లటిలోతులు కనపబడుతున్నాయి. పాప మీమె కెట్లా సాయం చెయ్యటం? నేను పంపిన నోట్లేమిచేసిందో? ఉపయోగించినట్లు కనబడదు. ఇదివరకటి ప్రాభవంలో తా నెరిగిన ధనవంతుల సంగతి మాట్లాడుకుంటూ. ఆ సాయంత్రపు గాలిలో కూచున్నాము. ఆమె నా దగ్గిరిగా, నావంక ప్రేమతో చూస్తూ పక్కన కూచుంటే చాలదూ? శుష్కించిన ఆమె దేహంగాని, వాలిన ఆమె బుజాలుగాని, రేగిన ఆ జుట్టుగాని నా వాంఛను అడ్డగించలేదు. ఆత్మనించి ఆత్మకి పిలుపులాగు తోచింది. అక్కడ కూచున్నంతసేపూ ఆమెని మనసుతో దగ్గిరికి పిలుస్తూనే వున్నాను.

"చివరికి మీకు పువ్వులన్నా తెచ్చి యివ్వాలనుకుంటాను. కాని కోపమొస్తుందని భయం."

"అవమానమంటే సహించలేను."

"అవమానమేముంది?"

"నన్ను లోకువకట్టడం."

పెదిమ వొణికింది. యే పూర్వానుభవాలో, కళ్లు కనపడని పురుష్వతమో, అహంభావంతో నిండి యేపశువులు కలిగించిన అవమానాలో, ఏవి యీమెనింత సెన్సిటివ్‌ని చేశాయి?

"నే నెన్నటికీ మిమ్మల్ని అవమానం చెయ్యను. మిమ్మల్ని చూచినప్పటినించి నా హృదయంలో కలిగిన పూజ్యభావమే నేను తెలియజేయ గలిగితే"-

"మీరు నన్ను 'మీ' రన్నప్పుడే తెలిసింది."

పాపం యీ హృదయం, ఈ మలిన ప్రపంచంనించి ఎంత బాధపడ్డదోకదా! ఈ అభిమానమెంత గాయపడ్డదోకదా! సన్నని వెన్నెలలో ఆమె సెలవు తీసుకొని ఆనందంతో, తృప్తితో యింటివేపు నడిచాను. ఆ మృదువైన వెన్నెట్లో యీసస్యాలూ, నీళ్ళూ, కీటకాలూ తృప్తినిపొంది ఆనందంతో విశ్రాంతి తీసుకున్నట్టు కనపడ్డది. నా జీవితానికి అర్థమూ ఫలితమూ పొందినట్లయింది నాకారాత్రి.

## 6

ఆనాడు ఆశ్వయుజ పౌర్ణమి. నేను వెళ్ళేటప్పటికి అతనికి వ్యాధి యెక్కువగా వుంది. చాలా మూలుగుతున్నాడు. యెప్పటివలె బైట జాకామల్లితీగ ప్రక్కగా కూచున్నాము. మాటిమాటికి ఆమె లోపలికి వెళ్ళివొస్తోంది.

"నేను వెడతాను పోనీ, లోపల కూచోండి" అన్నాను.

"అంత అవసరంలేదు. ఈకాసేపన్నా-" అని, ఆగింది-

"సాయంత్రమిట్లా మీతో మాట్లాడ్డం అలవాటయింది. బద్ధక మెక్కువయింది. మీమూలానే" అంది, జాలిచిరునవ్వుతో.

అతనికింత జబ్బుగావున్నా ఆమెముఖంలో కొంచెంమైనా వేదనలేదు, ప్రేమ తప్ప, ధీరత్వమా, అతని పైని నిజంగా ప్రేమా, లేక, విధ్యుక్తమనే భావంతో పరిచర్య చేస్తోందా?

కాఫీ తెచ్చింది.

ఎన్నాళ్లనించో అనాలనుకుంటున్న మాట అనేశాను :

"మీరు నాకు కాఫీ ఇస్తే నేను రాను. పోనీ ప్రత్యుపకారంగా మందు పంపితే ఒప్పుకోరు. మరి నాకుమాత్రం అభిమానం లేదూ?"

"నేను మీ యింటికి ఒచ్చినపుడు-" చప్పున సిగ్గుతో ఆగింది.

"ఒచ్చినపుడు-"

మాట్లాడలేదు.

"చెప్పరూ?"

"ఏం లేదు."

"చెప్పాలి!" అంటూ, బలవంతం చేశాను.

"నేను ఇంకోరిఇంటికి రావడమేమిటి?"

నాకు తట్టింది. ఈమెను చూసి నా భార్య కూచో మనన్నా అంటుందా?

"ఒస్తే"

"ఒస్తే కాఫీబదులు మం దివ్వండి," అనబోయినాను.

లోపల దగ్గుతున్నాడు. వెళ్లి చాలాసేపు రాలేదు. చుట్టూ సూర్యకాంతి పూర్తిగాపోయి, వెన్నెల ఆకాశమంతా ఆవరించింది. తొట్టిలో చెంగల్వలు విచ్చాయి. పావురాలు మూలిగాయి. గాలి ప్రారంభించింది. గడ్డిలో పచ్చపూలు ఊగాయి. చప్పున ఆమె పరుగెత్తుకొని వచ్చి 'ఒకసారి రండి' అంది.

సీతారామయ్య నెత్తురు కక్కుకొని పడిపోయినాడు. ఫిట్ తగ్గాక బైట వొచ్చి నుంచొని అంత ఆదుర్దాలోనూ, ధైర్యంతో తన నేమీ అంటనట్టు కావలసినదిమాత్రం చేస్తో నుంచున్న ఆమె స్థైర్యానికాశ్చర్యపడుతూ నుంచున్నాను. సీత రాముడితో అడవికి పోయిందని, సావిత్రి యముడితో వాదు లాడిందని, దుర్గమ్మ చీరెలు తగలపెట్టి ఖద్దరుసైను కట్టిందని, సూరమ్మగారు పాతివ్రత్యంమీద మహోపన్యాసమిచ్చారని లొట్టలేసే మహానుభావుల పవిత్రనేత్రాలకి దినదినమూ, నిమిషనిమిషమూ, మనోవాక్కాయ కర్మలమీద యే పత్రికల్లోనూ పేర్లు పడని స్త్రీలు నిలిపే నిగ్రహం కనపడదు. యెంతకాలం సాధన చెయ్యకపోతే ఆ దృఢప్రజ్ఞ కలుగుతుంది? మొగుడు చచ్చాడని గుండెలు బాదుకొని ముఖారిరాగంలో రూపకతాళంలో పెంకు లెగరగొట్టే సావిత్రి భర్త పునర్జీవితుడైనాడంటే నమ్ముతారు గాని, యీ "కులట" అనే వ్యక్తిలో పాతివ్రత్యమూ, నీమమూ గుర్తించగలరా?

"వెడుతున్నారా?" వెనుకనే ఆమె వొచ్చి నుంచుంది ; కంఠంలో వుండ మంటున్న ఆదుర్దా కనపడ్డది.

"ఈరాత్రి నన్ను ఇంజక్షను యియ్యనియ్యాలి."

"అంత యెక్కువగా వుందా?"

దగ్గిరగా నుంచున్న ఆమెను 'ఫీల్' అవుతూ, మాట్లాడలేదు.

"చెప్పరూ, చెప్పండి. నాతో చెప్పడానికి సంకోచించకండి."

నా ధైర్యం మీకు తెలీదన్నమాట ధ్వనిస్తోంది. చెయ్యిమీద చెయ్యేసి కళ్లు పైకెత్తి నా కళ్లలోకి చూసింది. అధిక ప్రయత్నంతో నాచేతులకి బుద్ధిచెప్పుకుని దూరంగా జరిగాను.

"ప్రమాదమేమీ లేదు. ఈ నెలరోజులూ మందు లేక పోవడంచేత మళ్లీ వెనుకదోవ పట్టింది. మీ కాయనపైన నిజమైన ప్రేమవుంటే మీ అభిమానాన్నన్నా త్యాగం చేసుకుని ఆయనకి మందు యిప్పించండి" అన్నాను.

నా కంఠంలోంచి పొర్లివచ్చే అనురాగ వాక్యాల్ని తొక్కిపడుతో, కళ్లు కిందికి వాల్చి ఊరుకుంది.

"నేను వెళ్లి సామాన్లు తీసుకొస్తాను. మీరేం భయపడకండి"-అన్నాను.

వేళ్లాడుతున్న ఆ చేతిని మాత్రం తాకకుండా వెళ్ల లేక పోయినాను. నిర్జీవ ప్రతిమవలె నుంచుని వుంది. తిరిగిచూడక బైలుదేరాను. ఇట్లా రోజూ ఈమెను చూస్తూ ఉంటే యెట్లా భరించడం? ఆశలేని యీ వియోగవ్యధతో? ఎన్నటికన్నా లాభంలేదా? విసుకు కలగదా ఆమెకు? ధనమూ స్వేచ్ఛా ఆకర్షించవా? ఎంత చిత్రమో ! ఒక్కసారి సీతారామయ్య, అతని స్థితీ, వ్యాధీ నాకు మనసుకే తట్టలేదు. అతనొకవేళ చచ్చిపోతే! ఆ పాడు ఆలోచనకి నాలిక కరుచుకున్నాను. కాని చచ్చిపోతే! ఆతలపు నన్ను వొదల్లేదు. ఆ ఆశ కళ్ల ముందునుంచి తొలగదు. ఈ రాత్రి యీ యిన్‌జక్షనే మాన్తే చాలా మట్టుకు నాకు మనోరథసిద్ధి కలుగుతుంది. ప్రేమ దేనికన్నా సంకోచించదుకదా! అని నా నీచత్వానికి నవ్వుకొని వెళ్లాను.

పదైంది. విశాలమైన వెన్నెల సముద్రంలో ఆ రోగి తల దగ్గర కూచున్న ఆ మహా పతివ్రత మహత్యంచేత ఆ గృహనౌక తేలుతోంది. నా కాళ్ల చప్పుడు విని ఆమె బైటికి వొచ్చింది.

"నిద్రపోతున్నారు. లేచిందాకా యిక్కడ కూచుందాము."

వెనుక చిన్న పువ్వులపందిరీ, మొల్లలవాసనా, చిన్న కుటీరమూ, చుట్టూ పరిమితిలేని యీ తెల్లని సముద్రమూ, నాప్రక్కన యీవనితా-. లోపలి అగ్నిని మరిచిపోగలిగితే! జ్వరమువంటి తాపంతో కుమిలిపోతున్నాను.

"భయంలేదు కదా?" అంది నెమ్మదిగా.

పాపం, యింతవరకు శవంవలె పడివున్న ఆ మృతజీవి పక్కన వొంటరిగా కూచొనివుంది. యెట్లా యివ్వను శాంతం ఆ హృదయానికి? అతనికి నేను జీవితమే ఇవ్వగలిగితే మళ్ళీ ఈమె నాకు కనబడుతుందా? ఆ ఆలోచనలో నావుదారత్వం నశించింది. అతను పోతేమాత్రం ఈమె హృదయంలో యింకా మోహానికి స్థలం వుంటుందా? యింకో వాంఛ ఆకళ్లలో వెలుగుతుందా? ఇంకో గృహంలో ఆ కళ్లు వెలుగుతాయా? యేమివ్వను ఈమె కోసం ? నాధనం, మర్యాద, శీలం అర్పిస్తాను తృణప్రాయంగా.

"మాట్లాడరేం?"

"నిజం చెబుతాను. యేమీ అనుకోకండి. ఆజాడ్యం కుదిరి ఆయన సంపూర్ణ స్వస్థత పొందుతాడనే ఆశలు మీ రిదివరకే ఒదులుకొనివుండాలి. అవునా?"

పైకి నిజం చెపుతున్నాననుకుంటున్నాను గాని, అంతరాత్మలో మాత్రం, ఆమెని బాధపెట్టాలని, అతని మీద ఆ బంధనాన్ని సడలించాలని కోర్కి కలుగుతోంది నాలో.

"మేమెంత ప్రయత్నించినా కాలం జరపవలసినవాణ్ణే! కాని ఇంకేం లేదు."

మాట్లాడలే దామె. చంద్రుడు మెల్లిగా పైకి జరుగుతున్నాడు. నీడలు ఊగుతున్నాయి. ఒక పున్నాగపువ్వామె తలమీద రాలింది.

"అది అతనికీ బాధే ! మీకూ బాధే ! కాదూ?" అని స్పష్టంగా అంది.

"ఈ సేవేలేకపోతే నాజీవితమే ఆఖరు." అంది మళ్ళీ.

నా కర్థంకావాలనా ? నాఆశ తీసెయ్యాలనా?

నేను ఊరుకున్నాను. యేంమాట్లాడను ? మెల్లిగా ఆమె కంఠంలోంచి యీమాటలు వొస్తున్నాయి. నాతోనో ఆ వెన్నెలతోనో చెప్పుకుంటోంది.

"తల్లిదండ్రులు లేనిదాన్ని, సమీపబంధువులు లేనిదాన్ని. భర్తనెరుగనిదాన్ని, ఈ లోకానుభవంలేనిదాన్ని, నన్నొక్కడు, మాబావ, నమ్మించి, ద్రోహంచేసి, తా ననుభవించి ఒక ధనికుడైన బంధువుకి అమ్మాడు. అతను తన వాంఛ తీర్చుకొని తను అప్పున ఒక మిత్రునికి దానంచేశాడు. తరవాత అనేక పశువులచేతుల్లో మారాను. అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆ దుర్వృత్తినుంచి, ఆ పరమనరకం నుంచి, విరక్తి పొందాలనుకున్నాను కాని మోక్షమందలేదు. ధనమూ, మానమూ, అందమూ, మర్యాదాలేని స్త్రీ జలప్రవాహము మధ్య తృణము. యేదారి పొయ్యేవాడి అనుగ్రహానికో దోసిలి వొగ్గవలసినదే. అప్పుడు నేర్చుకున్నాను. అప్పుడు తీసుకున్నాను ఈ ప్రతిజ్ఞ. యెవరినించీ అధర్మంగాగాని, ధర్మంగాకాని ఒక్క దమ్మిడీ స్వీకరించకూడదని, అవ్యాజంగా, అడగకుండా ఇస్తారు ధర్మాత్ములవలె ధనమూ, సహాయమూ. వడ్డీతో శరీరమునించి దానివిలువను గ్రహిస్తారు. ఆ మహాపంకంలోంచి బైటబడే సాధనమెరక్క మృత్యువు నాశ్రయింపబొయ్యే నన్ను చెయ్యిజూచి పైకిలాగి వుద్ధరించా రీయన. ఈయన పురుషసింహం. దుర్మార్గులలో దుర్మార్గుడు; కాలాంతకుడు. అతడు తన పట్టమహిషిని చేసుకుని తన స్నేహితులబృందంచేత నన్నారాధింప చేశాడు. నా మాట శాసనము. నా కనుసన్నలు రాజ్ఞీవచనాలు. నా కోపము ప్రళయావసానముగా జరిపాడు. యాభై వేల రూపాయల ఆస్తిని నన్నలంకరించేందుకు, నాకు నైవేద్యంగా, నా ఆనందానికై మూడేళ్ళలో వెదచల్లాడు. నా కదంతా కావాలా ? కాని యెంత విలువైనదీ నాకు స్వల్పమని ఆయన వుద్దేశ్యపడి ధనవ్యయంలో తన ప్రేమహారతినెత్తారు. నావల్ల నాకోసం ఈ నా డీస్థితిలోపడ్డ ఈయనకీ నే నెంత సేవచేస్తేమాత్రం ఋణం తీర్చుకోగలనా ?"

ఆమెమాటలు నిద్రపోబొయ్యేవారి మాటలవలె మెల్లిగా ఆగిపోయినాయి. నేను ఆలోచిస్తూ కూచున్నాను. నీడ మామీదికి జరిగింది. కొంగ ఒకటి చింత చెట్టుమీదనించి విడవకండా యేడుస్తోంది. రోగి లేచాడు. లోపలికి వెళ్ళి యింజక్షను యిచ్చాను. నిద్రపోగానే బైట వొచ్చి నుంచున్నాము;

ఆ రాత్రి నాకామెనించి కదలాలని లేదు. కాని వెళ్ళి తీరాలి.

"నేను వెడతానింక?" అన్నాను.

ఒద్దని ఆమె కళ్ళంటున్నాయనుకున్నాను. ఆమె మాట్లాడలేదు. నాకు కదలాలని లేదు. ఏం మాట్లాడను ? ఆమె కథ విన్న తరవాత ఏ మాటలు మాట్లాడినా పేలవంగా

ఉంటాయని తోచింది. ఇంకోవిధంగా ఓదార్చే సాహసం లేదు. ఒక్క మాటలతో ఒక్కచూపుతో నన్ను మాడిస్తే, ఎన్నటికన్నా ఆ గాయం మానుతుందా?

"నా మాట వినండి. మందివ్వకపోతే అట్టేకాలం ఆశలేదు." అన్నాను.

"ఆశ లేకుండా పోవాలనే కదూ మీ ఉద్దేశ్యం ?"

నేను ఉలికిపడ్డాను.

"ఏమిటిది, ఇల్లా అంటున్నారు ?" అన్నాను ఆశ్చర్యంతో.

"ఏం లేదు. ఈ చాకిరీ తప్పిపోయి నేను జీవితంలో సుఖం అనుభవించాలనిగా?"

"మొత్తానికి మీరు పడే శ్రమను చూస్తే మాత్రం భూలోకంలో ఇంత త్యాగం మింకా వుందని సంతోషించాలో, లేక మీవంటివారి కింత ఇబ్బంది తటస్థించినందుకు దుఃఖించాలో, తెలీటం లేదు."

"ఆ రెంటిలో ఏదీ న్యాయం కాదు."

"నేను వెడతాను"-అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

"మందుసంగతి చెప్పండి. పంపనామందు"- అన్నాను, వెళుతూ వెళుతూ.

అంగీకారంగా ఊరుకుంది.

"నేను ఉదయాన రానా ?" కొంచెం ఊరుకుని, "పోనీ, సాయంత్రాన రానా?" అన్నాను.

"ఆ., ప్రొద్దున్న ఆయనకోసం, సాయంత్ర మీకోసం. సరేనా ?"- - - - -

"మరి మీరు బిల్ పంపితీరాలి." అన్నది, పట్టుదలతో.

"పంపితే ?"

"సందేహ మక్కరలేదు. బిల్లును తిరక్కొట్టంలేండి" అని చిన్నగా, ప్రయత్న పూర్వకంగా నవ్వింది.

"పంపించ వద్దనరుగదా ?"

"ఏమిటి ?"

"బిల్లు"

"బిల్లులసంగతి చూచుకొందా. కాని నిజంగా నయంగా వుంటుందా?"

"చూద్దాం-నయంగా వుండక యేం చేస్తుంది!"

"నన్ను సంతోషపెట్టటానికి అంటున్న మిమ్మల్ని చూస్తే నమస్కారం చెయ్యాలో, జాలిపడలో నాకు తెలీటంలేదు. మీరే మమ్మల్నిట్లా కాపాడకపోతే మేము యేమయ్యేవాళ్ళం?" అంటూ, నాచేతులు రెండూ పట్టుకుని మొహాన అద్దుకుంది. ఆమెని రొమ్మున చేర్చుకుంటే ఆ నిమషాన యేమీ అనదనిపించింది. కాని అంతనీచంగా 'అడ్వాంటేజ్' తీసు కుంటానా ?

## 7

నెల కాగానే బిల్ పంపమని అడిగింది. పంపేను. అధికమైన దరిద్రంలో యెట్లా యిస్తుంది? కుర్రవాడితో అయ్యగారిని భోజనంచేసి రాత్రికి ఒకసారి తప్పకుండా రమ్మని చెప్పిందట.

నాబైస్కిల్ చప్పుడు విని బయటికివొచ్చింది. నా సైకిలుదీపం ఆ యింటి ముందువున్న యెర్రపువ్వుల తీగపైనించి ఆమెమిదపడ్డది. తెల్లని శుభ్రమైన చీర కట్టుకుంది. జుట్టు చాలా అల్లరిగా దువ్వి పువ్వులతో నవ్వుతున్నట్లలంకరించింది. ఎన్నాళ్ళయింది నే నామెను అట్లా చూసి? యెక్కడిదో ఒక మంచి జాకెట్ కూడా తగిలించింది. ఎందుకబ్బా యీవేషం? యేదన్నా ప్రయాణమా? యెవరన్నా వొస్తున్నారా? కాని, పొట్టిచేతుల రెవికతో చెంపల జీరలాడే జుట్టుతో చిరుగులచీర కట్టుకుని రోజా వున్నప్పుడే సహజంగా, అందంగా కనపడేది. యెందుకు? ఇట్లా యీరాత్రి యీమెని శుభ్రంకమ్మని అడిగేటంత ఆరోగ్యం వచ్చిందా రోగికి? సరాసరి నన్ను వొంటింటోకి తీసికెళ్ళింది. ఆయింటో ఒకపక్కకి సామానంతా తీసేసి నులకమంచంవేసి, తన చేతులతో వుతికిన ముడతల దుప్పటిఒకటి దానిమీదపరిచి వుంచింది. పక్కన ఒక పాతకుర్చీ, గూట్లో కంచెంబులో ఆకులు, పువ్వులు, పక్కన పళ్ళెంలో తమలపాకులు వున్నాయి. అత్తరు వాసన కొంచెంగా యెక్కణ్ణుంచన్నా వస్తుందేమో. నన్ను కుర్చీమీదకూచోమని తానెదురుగా సిగ్గునటిస్తో నుంచుంది. అంతా కొత్తగా వికారంగా కనిపిస్తోంది నాకు. మాట్లాడితే యేమౌతుందో అన్నట్టు, అట్లానే కూచున్నాను. ఆమె అట్లానే నుంచుంది. గూట్లోదీపం నిదానంగా వెలుగుతోంది. పక్కగదిలోంచి బాధతో కూడిన రోగివూపిరి వినపడుతోంది. ఇంక వుండలేక, "మాట్లాడరేం" అన్నాను.

"యేముంది, నేను సిద్ధంగానేవున్నాను," అని పక్కచూపులతో, లేనిసిగ్గుతో నన్ను పలకరించింది.

"యెందుకు?" అన్నాను. దడదడమనే హృదయంతో, నేను తనని అన్యాయంగా క్రూరంగా హాస్యం చేస్తున్నట్టు నావంక చూసింది.

"మీయిష్టానికి." అన్నది.

తెలుస్తున్నది నాకు.

నావొళ్లు వొణికింది. కళ్లు తిరిగాయి.

ఏమిటిది? యెందుకిట్లా చేసింది? చప్పున ఆలోచించాను.

"ఇట్లా కూచోండి" అన్నాను.

మంచంమీద కూచుని నాచేతిమీద చెయ్యేసింది.

"ఎందుకిట్లా?"

"మీ రుణం తీర్చుకునేందుకు."

"ఇట్లానా?"

"నాకు చాతైన విధం ఇది వొక్కటే, ఈ శూన్యగృహంలో ఇంకేమీలేదు."

"కాని మీ కంగీకారమేనా?"

"అంగీకారంతో ప్రసక్తిలేదు. ధర్మం"

"పోనీ నా కంగీకారమా?"

"మీ కిష్టం లేదా?" అని వోరగా చూసింది.

"యెందుకనుకున్నా రట్లా?"

"ఇంతలోకం చూసింతరవాత అంతమాత్రం తెలుసుకోలేనూ!" అంది.

"లోకానికి విరుద్ధం కూడా ఉంటుం దక్కడక్కడ."

"కాని మీ విషయం నాకు నిశ్చయమే."

"ఎప్పణ్ణించి?"

"మొదటిరోజునించి"

"ఐతే యింత ఆలస్యంచేసి బాధ పెట్టారేం?"

"ఇంత దరిద్రం పట్టందే?"

"కాని ఇది ధర్మమా?"

"నాబోటి పతితలకు ధర్మమనేది వుందా?"

"మీరు నా మనసులో మహాపతివ్రతలలో వొకరని తెలీదూ?"

"అదే నిజమైతే వాంఛ యేమిటి?"

"నాలోని మృగానిదా వాంఛ. నాది కాదు."

"దానికే చెల్లిస్తున్నాను, బిల్"

"నాయెడల అన్యాయంకాదూ?"

"యేది?"

"నీహృదయంలేని దేహంతో నేను సంతృప్తి పొందుతాననుకోడం"

"మీరు పొందరు. మీలోని మృగం పొందుతుందనుకున్నాను."

"ఇదికాదు నేను కోరేది."

"ఏది?"

"నీహృదయం."

"అది పరాయత్తం."

"మరి దేహాన్ని అమ్ముతున్నావా, వేశ్యవలె?"

"వేశ్యకన్నా అధమంగా, ఉచితంగా ఉపకారం పొందమంటారా?"

"మిత్రులదగ్గర్నించి"-

"నాకు మిత్రులు లేరు. ఉండరు."

"ఐతే నా కీ బిల్ అక్కర్లేదు."

"ఐతే యింక మీ సహాయం మాకొద్దు."

"తప్పదా?"

ఆలోచించాను నుంచుని.

"పోనీ నాబిల్ విలువమాత్రం తీసుకుని వెళ్లనిస్తారా? అన్యాయంగా యెక్కువ తీసుకోడం తప్పుకదా?"

"సరే."

నాచేత్తో ఆమె చెంపల్ని తాకాను.

"ఈ త్యాగానికై యెంత రక్తం మీ హృదయంలోంచి వొలికివుంటుందో నాకు తెలుసు" అన్నాను.

"బిల్ తీరింది కాని మీ వాత్సల్యం తీరలేదు" అని, దగ్గిరికి వచ్చి, నా ముఖాన్ని పట్టుకుని ముద్దు పెట్టుకుంది.

"ఈ జన్మలో నేను పంపగల బిల్లుల మొత్తమంతా తీరింది" అన్నాను.

◆ ◆ ◆

*ప్రచురణ : (విచిత్రనళీయం కథలు) ఎమెస్కో ప్రచురణ, 1967*